నేను మళ్లీ ఎమ్మెల్యేనైతే..

యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాను



ముమ్మిడివరం: రానున్న ఎన్నికల్లో మూడోసారి ముమ్మిడివరం ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత తీర ప్రాంతాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తాను. నియోజకవర్గంలో తీరం వెంబడి ఆయిల్ కంపెనీలు ఆయిల్ నిక్షేపాల అన్వేషణ జరుగుతుంది. ఆయా ప్రాంతాల్లో గ్యాస్ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాను. అలాగే కొబ్బరి ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేసి మహిళలకు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాను. తీరం వెంబడి ఉన్న మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచేందుకు కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్లు, ఫిషింగ్ హార్బర్ నిర్మించేందుకు కృషి చేస్తాను. ఇప్పటికే నియోజకవర్గంలో 120 వాటర్ ట్యాంకులు నిర్మించి ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేశాను. ఇంకా అక్కడక్కడా తాగునీటి సమస్య ఉంది. వాటిని పరిష్కరించి తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటాను. లంక గ్రామాలలో విలువైన భూములు కోతకు గురవుతున్నాయి. ఇప్పటికే ఎదుర్లంకలో రూ.78 కోట్లతో రివిట్‌మెంట్, గ్రోయన్స్ పనులు చేపడుతున్నాం. లంకాఫ్ ఠాన్నేల్లంక, సలాదివారి పాలెంలో రివిట్‌మెంట్, గ్రోయన్స్ నిర్మాణం కోసం రూ.140 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశాం. ప్రభుత్వ అనుమతులు రాగానే వాటిని పూర్తి చేస్తాం.

– ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ధవళేశ్వరం నుంచి అమలాపురానికి తాగునీరు



అమలాపురం టౌన్: ధవళేశ్వరం నుంచి పైపులైన్ల ద్వారా అమలాపురానికి గోదావరి జలాలను తరలించి ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు అందించాలన్నదే నా లక్ష్యం. ఇప్పటికే ఉన్న తాగునీటి ప్రాజెక్టులను దాదాపు రూ.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్ర మంత్రిగా రెండు పర్యాయాలు పనిచేసిన అనుభవంతో ఇప్పటికే నియోజకవర్గానికి శాశ్వత ప్రాతిపదిక తాగునీటి ప్రాజెక్టుల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో నా లక్ష్యాన్ని సాధిస్తాను. నియోజకవర్గంలో కీలకమైన రోడ్లన్నీ ఆధునీకరించాను. మిగిలిన రహదారుల ఆధునీకరణ కొనసాగిస్తాను. అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి బైపాస్ రోడ్డును ఆధునీకరించడంతో పాటు కొత్తగా మరో బైపాస్ రోడ్డును కూడా నిర్మించాం. అమలాపురం పట్టణంలో ఇప్పటికే నిర్మితమై ఉన్న కీలకమైన ఈదరపల్లి వంతెన, ఎర్ర వంతెన, నల్ల వంతెనల స్థానే పక్కనే ప్రత్యామ్నాయంగా రెండో వంతెనల నిర్మాణానికి రూ.9 కోట్ల నిధుల కేటాయించాను. ఈ మూడు వంతెనలను కూడా నిర్మిస్తే జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సమస్యకు శాశ్వతంగా తెరపడుతుంది. రానున్న ఐదేళ్లలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేసి సమస్యలు, అసౌకర్యాలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాను.

– వైఎస్సార్ సీపీ అమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పినిపే విశ్వరూప్

ఫ్యాన్‌కు ప్రజాదరణ.. సైకిల్‌కు వేదన

- ప్రచారంలో దూసుకుపోతున్న ఎమ్మెల్యే పొన్నాడ
- అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్న ప్రజలు
- ఎన్నికలకు ముందే కకావికలమైన కూటమి



ముమ్మిడివరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: ఎన్నికల పోలింగ్ దగ్గర పడుతున్న వేళ వైఎస్సార్ సీపీ ప్రచారంలో దూసుకుపోతుంది. ఆ పార్టీ అభ్యర్థి పొన్నాడకు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పడుతున్నారు. ప్రజల ప్రజాదరణతో ఫ్యాన్ గాలి మరింత జోరందుకుంది. ప్రజా సంక్షేమమే పరమావధిగా పాలన సాగించిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే మా మద్దతు అంటూ ప్రజలు ముందుకొస్తున్నారు. ఇప్పటికే వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ నియోజకవర్గంలోని గ్రామాల్లో విస్తృత ప్రచారం సాగించారు. మత్స్యకార, ఎస్సీ, బీసీ వంటి పేద సామాజిక వర్గాల ప్రజలు తమ మద్దతు వైఎస్సార్ సీపీకేనని బహిరంగంగానే చెబుతుండడంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ సతీష్‌కుమార్ విజయం నల్లేరు మీద నడకేనన్న చర్చ సాగుతుంది.

కలిసి రాని కూటమి.. తప్పదా ఓటమి..?

ముమ్మిడివరం నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ అభ్యర్థుల మధ్యే ప్రధానంగా పోటీ ఉంటుంది. గత ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన అభివృద్ధిని చెబుతూ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. పొన్నాడ సతీమణి నీరజ, కుమారులు సత్య సుమంత్, రేవంత్‌తో పాటు ఇతర కుటుంబ సభ్యులు గ్రామాల్లో పర్యటించి ప్రచారం చేస్తూ మద్దతు కూడగట్టుకుంటున్నారు. మరోవైపు టీడీపీ అభ్యర్థి దాట్ల సుబ్బరాజు మాత్రం తాను అధికారంలో ఉండగా ఎలాంటి అభివృద్ధి చేశారో చెప్పుకోవడానికి ఏమీ లేక వైఎస్సార్ సీపీపై విమర్శలతో కాలం గడిపేస్తున్నారు. ఆఖరి నిమిషం వరకూ కూటమి అభ్యర్థి ఎవరో తేలకపోవడంతో సుబ్బరాజు ప్రచారంలోనూ బాగా వెనకపడ్డారు. వాస్తవానికి ఈ దఫా ముమ్మిడివరం నుంచి కూటమి తరపున జనసేన పార్టీ ఇన్‌చార్జి పితాని బాలకృష్ణ బరిలో దిగేందుకు తీవ్ర ప్రయత్నాలు సాగించారు. చివరకు కూటమి అభ్యర్థిత్వం దాట్లను వరించడంతో జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పితాని బాలకృష్ణ సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిపోయారు. అంతేకాదు ఆయన అనుయాయులంతా గ్రామాల వారీగా వైఎస్సార్ సీపీలోకి వెళ్లిపోయారు. దీంతో కూటమి కకావికలమైపోయింది. పేరుకి కూటమి తరపున పోటీ చేస్తున్నానని దాట్ల చెబుతున్నా జనసేన, బీజేపీ తరపున సరైన నేతలు లేకపోవడంతో పాటు జనసేన కార్యకర్తలంతా వైఎస్సార్ సీపీలోకి చేరిపోవడంతో ఆయన నైరాశ్యంలో మునిగిపోయారు. పైగా గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన సమయంలో దాట్ల సుబ్బరాజు వ్యవహార శైలిపై ప్రజల్లో అసంతృప్తి ఉండడమూ ఆయనకు ప్రతికూలాంశంగా కనిపిస్తుంది. దీంతో ఈ ఎన్నికల్లోనూ దాట్ల సుబ్బరాజుకు ఓటమి తప్పదని టీడీపీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

బాణం ఎక్కుపెట్టిన రామలక్ష్మణులు

పితాని బాలకృష్ణ చేరికతో వైఎస్సార్ సీపీకి అదనపు బలం చేరినట్టైంది. రెండు బలమైన సామాజిక వర్గాలకు చెందిన పొన్నాడ, పితానిలు రామలక్ష్మణులుగా చెప్పుకుంటూ ప్రచారంలో ముందుకు సాగుతున్నారు. ఆయా సామాజిక వర్గాల వారీగా ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసి మద్దతు కూడగట్టడంలో సఫలీకృతులయ్యారు. ప్రధానంగా నియోజకవర్గంలో జనసేన కార్యకర్తలంతా దాదాపుగా వైఎస్సార్ సీపీలోకి చేరిపోవడంతో అత్యధిక శాతం గ్రామాల్లో రాజకీయం ఏకపక్షంగా మారిపోయింది. మరోవైపు బలమైన ఎస్సీ సామాజిక వర్గాల మద్దతు పొన్నాడకే ఉండడం కలిసొచ్చే అంశంగా కనిపిస్తుంది. గతంలో రెండు పర్యాయాలు ఎమ్మెల్యేగా పనిచేసిన పొన్నాడ సతీష్‌కుమార్ తన విజయంపై పూర్తి ధీమాతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే సామాజిక వర్గాల సమీకరణ ద్వారా అదనపు బలం అందుకుని వ్యూహాత్మకంగా అడుగులేస్తున్నారు. గత ఐదేళ్లలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను వివరిస్తూ సమరోత్సాహంతో ప్రచారం సాగిస్తున్నారు. ముఖ్యంగా మత్స్యకార, ఎస్సీ, బీసీ గ్రామాల్లో పొన్నాడకు మహిళలు ఎదురేగి హారతులిచ్చి ఘన స్వాగతం పలుకుతున్నారు. అభిమానులు అడగడుగునా పూల జల్లులు, గజమాలలతో సత్కరించి ఆదరిస్తున్నారు. ప్రచారంలో ఊరూరా తనకు లభిస్తున్న ఆదరణే తన విజయానికి సంకేతమని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ ఉత్సాహంగా ముందుకెళుతున్నారు.

నేటి నుంచి వీరేశ్వరుని బ్రహ్మోత్సవం



బ్రహ్మోత్సవాలకు సిద్ధమైన భద్రకాళీ సమేత వీరేశ్వరుడు

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 11వ తేదీ శనివారం నుంచి 15వ తేదీ వరకూ ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఆదిశైవ అర్చక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామశర్మ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి. 11న గణపతి పూజ, పంచాగవ్యారధన, దీక్షాధారణ, అభిషేకాలు, నూతన వధూవరులను చేయడం, ధ్వజారోహన, సాయంత్రం భద్ర పీఠంపై గ్రామోత్సవం, 12న లక్ష్మీగణపతి హోమం, ప్రధాన కలశారాధన, వాస్తు పూజ, చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు, బ్రహ్మోత్సవ కల్యాణం, 13న సరస్వతీ హోమం, రుద్రహోమం, 14న గవ్యాంతము, చండీ హోమం, కళాహోమాలు, 15న పూర్ణాహుతి, వసంతోత్సవం నిర్వహించనున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు.

నిస్సహాయ స్థితిలో.. పెద్దదిక్కులా..



జార్జిపేటలో మట్టపర్తి దుర్గాదేవి కుటుంబ సభ్యులు

తాళ్లరేవు: కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం నీలపల్లి గ్రామానికి చెందిన మట్టపర్తి దుర్గాదేవిది అత్యంత దయనీయ గాథ. భర్త, పిల్లలతో ఆనందంగా సాగుతున్న ఆమె జీవితంలో ఒక ప్రమాదం తీరని విషాదాన్ని నింపింది. ఆమె భర్త సుబ్బారావు సెంట్రింగ్ కూలీగా పనిచేసేవాడు. అయితే రెండేళ్ల క్రితం భవన నిర్మాణ పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ భవనం పైనుంచి కిందకు పడిపోవడంతో తల, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. సుమారు ఏడాది పాటు చికిత్స పొందిన తరువాత సుబ్బారావు మృతి చెందాడు. కుటుంబాన్ని పోషించే వ్యక్తి చనిపోవడంతో వారి జీవనమే ప్రశ్నార్థకంగా మారింది. అలాంటి పరిస్థితుల్లో జగనన్న ప్రవేశపెట్టిన నవరత్నాలు ఆ కుటుంబాన్ని ఆదుకున్నాయి.

భర్త మరణం తరువాత దుర్గాదేవి జార్జిపేటలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చి నివసిస్తుంది. ఆమె తండ్రి రాయుడు వెంకటేశ్వర్లు కౌలు రైతు. వారి ఆదాయమూ అంతంత మాత్రమే. వ్యవసాయంలో లాభనష్టాలు ఎలా ఉన్నా ప్రభుత్వం అందించే రైతు భరోసా, చేయూత, ఆసరా పథకాలతో వెంకటేశ్వర్లు కుటుంబాన్ని పోషిస్తున్నారు. మరోవైపు దుర్గాదేవికి ప్రభుత్వం వితంతు పింఛన్ మంజూరు చేసింది. ఆమె ఇద్దరి పిల్లల చదువుకు ఆటంకం కలగకుండా అమ్మఒడి పథకం కొండంత అండగా నిలిచింది. ఆమె కుమార్తె రేణుకాదేవి తాళ్లరేవు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి కాకినాడలోని ఎంఎస్ఎన్ చార్టీస్ కళాశాలలో డిగ్రీ చదువుతోంది. అలాగే కుమారుడు శ్రీనివాస్ ఈ ఏడాది పదో తరగతి పూర్తి చేశాడు. జీవితం భారమైనా ప్రభుత్వం అందిస్తున్న సహకారం, జగనన్న అందిస్తున్న ప్రోత్సాహంతోనే తమ జీవితాల్లో వెలుగులు నిండాయని దుర్గాదేవి ఆనందం వ్యక్తం చేస్తుంది.

ప్రభుత్వ పథకాలే మాకు అండ

ప్రమాదవశాత్తూ భర్తను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న నా కుమార్తె జీవితానికి సీఎం జగన్ అందించిన పథకాలే కొండంత అండగా నిలిచాయి. తక్షణమే వితంతు పింఛన్ మంజూరు చేయడంతో ఆర్థికంగా ఆదుకుంది. అమ్మ ఒడి పథకం ద్వారా వచ్చే డబ్బులతో పిల్లలను బాగా చదివించుకుంటుంది. చేయూత, ఆసరా పథకాలు మా జీవితంలో వెలుగులు నింపుతున్నాయి,.

– రాయుడు అనంతలక్ష్మి, దుర్గాదేవి తల్లి

బాగా చదువుకుని ఉద్యోగం తెచ్చుకుంటాను

మా నాన్న చనిపోవడంతో మా కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. అయినా జగనన్న అందించిన అమ్మ ఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల సాయంతో అమ్మ మమ్మల్ని చదివిస్తుంది. ప్రభుత్వ ప్రోత్సాహంతో బాగా చదువుకుని మంచి ఉద్యోగం తెచ్చుకుని మా కుటుంబానికి అండగా ఉంటాను.

– మట్టపర్తి రేణుకా దేవి, దుర్గాదేవి కుమార్తె

వైఎస్సార్ సీపీని గెలిపించండి



నగర పంచాయతీలో ప్రచారం నిర్వహిస్తున్న పితాని బాలకృష్ణ తదితరులు



అమలాపురంలో ప్రచారం చేస్తున్న దేవరపల్లి గీత తదితరులు

ముమ్మిడివరం: ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎంపీగా రాపాక వరప్రసాద్‌లను గెలిపించాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పితాని బాలకృష్ణ పేర్కొన్నారు. ఆయన శుక్రవారం నగర పంచాయతీలోని 3, 13 వార్డులతో పాటు చిన కొత్తలంకలో ప్రచారం నిర్వహించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కుడిపూడి శంకరరావు, కోలా బాబ్జీ, పీటీవీ వర్మ, మట్టపర్తి సత్యనారాయణ, రెడ్డి శివన్నారాయణ, పెయ్యల చిట్టిబాబు, ఇందుకూరి సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యం

అమలాపురం టౌన్: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సీఎం జగన్‌తోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి దేవరపల్లి గీత అన్నారు. స్థానిక 27వ వార్డులో శుక్రవారం ఆమె స్థానిక నాయకులతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అమలాపురంలో మంత్రి పినిపే విశ్వరూప్‌ను గెలిపించుకుని నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బండారు గోవిందు, వార్డు పార్టీ ఇన్‌చార్జి, న్యాయవాది శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో కుబేర హోమం




ఆలయంలో కుబేర హోమం నిర్వహిస్తున్న భక్తులు

అమలాపురం రూరల్: మండలంలోని నల్లమిల్లి గ్రామంలోని మురళీకృష్ణ దేవాలయంలో అక్షయ తృతీయను పురస్కరించుకుని శుక్రవారం తెల్లవారుజామున శ్రీకృష్ణ భగవానునికి పంచామృతాభిషేకం, విశేష పూజలు, కుబేర హోమం నిర్వహించారు. వంగలపూడి మాతాజీ నిర్విశేషానంద భక్తులకు అక్షయ తృతీయ వైశిష్ట్యాన్ని వివరించారు. మురళీకృష్ణ విగ్రహ దాతలు బి.ప్రసాద్, సుధ దంపతులను సద్గురు గీతాశ్రమ వ్యవస్థాపకులు సత్కరించారు. కార్యక్రమంలో మాతా బ్రహ్మానందగిరి, మాతా ప్రణవానందగిరి, మాతా పరబ్రహ్మానందగిరి, డాక్టర్ గొలకోటి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

5న మెరిట్ జాబితా విడుదల

యానాం: నాన్ నీట్ కోర్సులైన ఇంజినీరింగ్, ఆర్ట్స్ అండ్ సైన్స్ కోర్సులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల మెరిట్ జాబితాను జూన్ 5న విడుదల చేయనున్నట్లు సెంటాక్(సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ) అధికారులు శుక్రవారం తెలిపారు. ఇప్పటికే ఆయా కోర్సులకు 9,993 దరఖాస్తులు వచ్చాయని జూన్ 5న ర్యాంకుల జాబితా, 9న రివైజ్డ్ ర్యాంకుల జాబితాను ప్రకటిస్తారన్నారు. మొదటి విడత కౌన్సిలింగ్ వచ్చే నెల 11వ తేదీ నుంచి, రెండో విడత కౌన్సిలింగ్ 24వ తేదీ నుంచి ఉంటుందన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



టీడీపీ కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

అల్లవరం: మండలంలోని గోడి, మొగళ్లమూరు గ్రామాల్లో పలువురు టీడీపీ కార్యకర్తలు ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ వైఎస్సార్ సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక టీడీపీ నేత సత్తిబాబురాజు ప్రధాన అనుచరుడు సత్యనారాయణమూర్తి టీడీపీని వీడడంతో గోడిలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. కార్యక్రమాల్లో సర్పంచ్ రాయుడు విష్ణు, సొసైటీ చైర్మన్ కాండ్రేగుల జవహర్, కొల్లు వెంకటరమణ, గ్రామకమిటీ అధ్యక్షులు దొమ్మేటి వెంకటేశ్వరరావు, రేవు శ్రీనివాసరావు, కడలి సత్యప్రసాద్ పాల్గొన్నారు.

దగ్ధమైన తాటాకిల్లు

ఆలమూరు: మండలంలోని మడికి శివారు నాగులపేటలో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో తాటాకిల్లు దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన గోంపా మాలిబాబు, కొండమ్మ దంపతులకు చెందిన పూరిగుడిసె నుంచి హఠాత్తుగా మంటలు వెలువడ్డాయి. స్థానికులు మంటలు అదుపు చేసేలోపే పూరిగుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఆ సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో ప్రాణపాయం తప్పింది. షార్ట్ సర్క్యూట్ ఈ ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. అగ్నిప్రమాదంలో సుమారు రూ.లక్ష వరకూ ఆస్తి నష్టం సంభవించి ఉంటుందని స్థానికులు అంచనా వేస్తున్నారు.

నగరం.. ప్రగతి పథం..



ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయం



ముమ్మిడివరం నగర పంచాయతీ

- అభివృద్ధితో మారిన నగర పంచాయతీ రూపురేఖలు
- విశాలమైన రోడ్లతో పాటు మౌలిక సదుపాయాల కల్పన

ముమ్మిడివరం: నియోజకవర్గ కేంద్రమైన ముమ్మిడివరం మేజర్ పంచాయతీగా ఉండగా ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదు. 2013 సంవత్సరంలో నగర పంచాయతీగా రూపాంతరం చెందినా టీడీపీ పాలక వర్గంలో అభివృద్ధిని గాలికొదిలేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సుమారు రూ.200 కోట్ల నిధులతో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టడంతో నగర పంచాయతీ రూపురేఖలు మారిపోయాయి. నాటి నుంచి ముమ్మిడివరం నగర పంచాయతీ ప్రగతి పథంలో దూసుకెళుతుంది. సువిశాలమైన రోడ్లు, రెసిడెన్సియల్ ఏరియా, గ్రీన్ బెల్ట్, ఇండస్ట్రియల్ జోన్ వంటి అధునాతన సదుపాయాలతో ప్రణాళికలు సిద్ధం చేశారు.



ముమ్మిడివరంలో నిర్మించిన ప్రైమరీ హెల్త్ సెంటర్



నగర పంచాయతీ శివారు రెడ్డివారిపాలెంలో నిర్మించిన సీసీ రోడ్డు

ఒక్కో అడుగు పడిందిలా

- ముమ్మిడివరం నగర పంచాయతీ 26 చదరపు కిలోమీటర్లలో విస్తరించి గ్రామీణ ప్రాంతాలతో మిళితమై ఉంది. 2021లో నగర పంచాయతీలో వైఎస్సార్‌సీపీ పాలక వర్గం ఏర్పడింది. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ చొరవతో ముమ్మిడివరం అభివృద్ధి దిశగా అడుగులేసింది. ప్రధానంగా ముందుగా ముమ్మిడివరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేశారు.
- నగర పంచాయతీని అభివృద్ధి చేయాలనే సంకల్పంతో చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ కుమార్ ఆధ్వర్యంలో 20 ఏళ్ల కాల పరిమితితో మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసి కౌన్సిల్ ఆమోదంతో ప్రభుత్వానికి నివేదించారు. ముమ్మిడివరంలో 216 జాతీయ రహదారిని ఆనుకుని 10 నుంచి 15 అడుగుల వెడల్పుతో రహదారులను 40 అడుగుల రహదారులుగా విస్తరించారు.
- ఏఐఐబీ బ్యాంకు నిధులు రూ.115 కోట్లతో సమగ్ర మంచినీటి పథకాన్ని ప్రారంభించి నగర పంచాయతీలో తాగునీటి సమస్యను పరిష్కరించారు. మారుమూల ప్రాంతాలకు సైతం పైపులైన్లు ఏర్పాటు చేసి తాగు నీరందించే చర్యలు చేపట్టారు. ఐదు ఓవర్ హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేసి బొబ్బర్లంక నుంచి గోదావరి జలాలలను తీసుకొచ్చి శుద్ధి చేసి ప్రజలకు అందిస్తున్నారు.
- 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5.70 కోట్లతో మారుమూల గ్రామాల్లో సైతం సీసీ రోడ్లు, సీసీ డ్రైన్లు ఏర్పాటు చేశారు. పుంత రోడ్లు సైతం అభివృద్ధికి నోచుకున్నాయి. 10వ వార్డు అంబేడ్కర్ నగర్‌లో రూ.18 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. రూ.కోటితో నగర నడిబొడ్డున డా.బీ.ఆర్ అంబేడ్కర్ కన్వెన్షన్ హాల్ నిర్మించారు.
- నగర పంచాయతీలో జగనన్న కాలనీల కోసం ప్రభుత్వం 26.65 ఎకరాల భూసేకరణ చేసి 8 లేఅవుట్లు ఏర్పాటు చేశారు. సుమారు 1,314 మంది లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేశారు. రోడ్లు, విద్యుత్ వంటి మౌలిక వసతులు కల్పించారు.

నగర పంచాయతీ విస్తీర్ణం 26 చదరపు కిలో మీటర్లు

జనాభా	25,355 మంది
ఓటర్లు	21,238
పురుషులు	10,411
మహిళలు	10,827

గత ఐదేళ్లలో మంజూరైన నిధులు

ఏఐఐబీ బ్యాంకు నిధులు	రూ 133.66 కోట్లు
ఏఎఫ్‌సీ నిధులు	రూ.1.50 కోట్లు
15వ ఆర్థిక సంఘం నిధులు	రూ.5.70 కోట్లు
అర్బన్ హెల్త్ సెంటర్ ప్రత్యేక నిధులు	రూ. 80లక్షలు
గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు	రూ. 2.80 కోట్లు
ఎంపీ ల్యాడ్స్ నిధులు	రూ.20లక్షలు

క్లుప్తంగా

ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ సిబ్బంది

ఉప్పలగుప్తం: ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ప్రతిభ చూపి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులను హెచ్ఎం నూకల సత్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ప్రథమ స్థానం సాధించిన బి.మాధవి, కరాటం నాగ పల్లవి, ద్వితీయ స్థానం సాధించిన మానే జయ భార్గవి, తృతీయ స్థానం సాధించిన జ్ఞాన శివ సాయి నాగశ్రీలను ఉపాధ్యాయులంతా దుశ్శాలువాతో సత్కరించి అభినందించారు.

యానాంలో పనిచేసేవారికి 13న సెలవు

యానాం: ఆంధ్రప్రదేశ్‌లో ఈ నెల 13న సాధారణ ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్న నేపథ్యంలో యానాంలో పనిచేస్తున్న ఏపీ సరిహద్దు గ్రామాల సిబ్బందికి, కార్మికులకు వేతనంతో కూడిన సెలవును ప్రకటిస్తున్నట్లు ఆర్ఏఓ మునిస్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్ఏఓ మునిస్వామితో అబ్జర్వర్ గణేష్ సమావేశం



ఆర్ఏఓ మునిస్వామితో సమావేశమైన కాకినాడ జిల్లా అబ్జర్వర్ గణేష్

యానాం: కాకినాడ జిల్లాలో ఈ నెల 13న సాధారణ ఎన్నికల పోలింగ్ జరగనున్న నేపథ్యంలో సరిహద్దుగా ఉన్న కేంద్రపాలిత ప్రాంతం యానాం అధికార యంత్రాంగం తమకు సహకరించాలని కాకినాడ జిల్లా సాధారణ ఎన్నికల అబ్జర్వర్, ఐఏఎస్ అధికారి కె.గణేష్ కోరారు. శుక్రవారం ఆర్ఏఓ చాంబర్‌లో మునిస్వామితో ఆయన సమావేశమయ్యారు. ప్రధానంగా మద్యం అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యానాం ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

నిఘా బృందం తనిఖీలు



అమలాపురంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎఫ్ఎస్‌టీ బృందం అధికారులు

అమలాపురం టౌన్: స్థానిక నల్లవంతెన వద్ద అమలాపురం ఫ్లయింగ్ స్క్వాడ్ (ఎఫ్ఎస్‌టీ) నిఘా బృందం ప్రతినిధులు శుక్రవారం అనేక వాహనాలను ఆపి తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా నగదు, మద్యం, ఓటర్లను ప్రలోభ పెట్టే పలు రకాల వస్తువుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు ఎఫ్ఎస్‌టీ అధికారి, అమలాపురం పంచాయతీరాజ్ డీఈఈ అన్యం రాంబాబు తెలిపారు. సీ విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులపై తమ బృందం తక్షణమే స్పందించి సంఘటనా స్థలానికి వెళ్లి బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. భట్నవిల్లిలో రూ.3 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యం, నిందితులతో స్పెషల్ టాస్క్‌ఫోర్స్, ఎస్ఈబీ సిబ్బంది

తాళ్లరేవు: మండల పరిధిలో స్పెషల్‌టాస్క్ ఫోర్స్, ఎస్ఈబీ తాళ్లరేవు సిబ్బంది శుక్రవారం నిర్వహించిన దాడుల్లో గోవా రాష్ట్ర మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా స్టేట్ స్పెషల్ టాస్క్‌ఫోర్స్ మంగళగిరి హెడ్ ఆఫీస్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సత్యనారాయణ తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా చినవలసల గ్రామంలో 40 బాక్సుల గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు మల్లాడి మురళీకృష్ణ, మల్లాడి నూకరాజులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

12 నుంచి పోలేరమ్మ జాతర

యానాం: స్థానిక కనకాలపేటలో కొలువైన గ్రామదేవత పోలేరమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను ఈ నెల 12వ తేదీ నుంచి 14వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం తెలిపారు. 12న పోలేరమ్మ మూలవిరాట్‌కు పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమార్చన, చండీ హోమం, అన్నప్రసాదం, గరగ నృత్యం, చిన్నజాతర, 13న అమ్మవారి వేషధారణలు, పెద్ద జాతర మహోత్సవం, 14న తీర్థ మహోత్సవం, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు, కోలాటం ఉంటాయన్నారు.